www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 9 జులై 2024
5
తూర్పుగోదావరి

హడావుడిగా శానిటేషన్ పనులు

దేవరపల్లి : దేవరపల్లి గ్రామంలో మంగళవారం కలెక్టర్ పర్యటన నేపథ్యంలో గ్రామంలో హడావుడిగా శానిటేషన్ పనులను చేపట్టారు. యంత్రాలను ఉపయోగించి ఆఘమేఘాలపై చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. రోడ్లకిరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను సైతం పీకిపడేస్తున్నారు. మంత్రులు, ఉన్నతాధికారుల పర్యటనలు ఉన్న సమయంలో మాత్రమే గ్రామంలో శానిటేషన్ పనులు జరుగుతున్నాయని, మిగిలిన సమయంలో ఎవరూ పట్టించుకోవట్లేదని స్థానికులు చెబుతున్నారు. వారానికి ఒకసారి అయినా మంత్రులు లేదా ఉన్నతాధికారులు తమ గ్రామానికి రావాలని వారు కోరుకుంటున్నారు.

చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

ఈ-పంటపై అయోమయం

- నమోదుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- రాయితీలు, నష్టపరిహారంపై

అన్నదాతల ఆందోళన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతన్నలు సాగుకు ఉపక్రమించారు. అదును చూసుకుని విత్తనాలు విత్తుతున్నారు. గోదావరి ఆయకట్టుతో పాటు మెట్ట ప్రాంత రైతులకూ ఈ ఏడాది సాగుకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి. పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి నీరు విడుదల చేయడంతో మెట్టలోనూ సాగు ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు 5 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా. ఏటా పంటల సాగు సమయంలో పొలాలకు వచ్చే వ్యవసాయ సిబ్బంది ఈసారి కనిపించక పోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వం ప్రతి ఏటా సాగు ప్రారంభ దశలో ఈ-క్రాప్ నమోదు చేయించింది. ప్రభుత్వ రాయితీలు, విపత్తుల సమయంలో పరిహారం, పంట అమ్మకాల సమయంలో ఈ క్రాప్ తప్పనిసరి చేసింది. తాజాగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ-క్రాప్‌పై ఎటువంటి స్పష్టతా ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై స్థానికంగా ఉండే వ్యవసాయ, సిబ్బందిని ఆరా తీస్తున్నారు. వారి వద్ద కూడా సరైన సమాధానం లేకపోవడంతో దిగులు చెందుతున్నారు. పంట సాగుకు ఎరువులు కావాలన్నా, పంటను విక్రయించుకోవాలన్నా, పంట నష్టం జరిగినప్పుడు పంటల బీమా పొందాలన్నా, ఈ క్రాప్ ఇప్పటికీ ప్రారంభించకపోతే ఎలా..? అనే ప్రశ్న తలెత్తుతోంది.

ఇంతటి ప్రాధాన్యమున్న పంటల నమోదు కార్యక్రమంపై ప్రభుత్వం అలసత్వం చేయడాన్ని తప్పుబడుతున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో ఏటా ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి భరోసా అందేదని, కొత్త ప్రభుత్వం కొలువు దీరి నెల రోజులు గడుస్తున్నా పెట్టుబడి సాయం అందకపోవటంతో అయోమయ పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం 2019 నుంచి 2023 వరకు ఈ-క్రాప్ ఆధారంగానే రైతులకు పథకాలను వర్తింపజేసిది. ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభమైన వెంటనే ఈ-క్రాప్ నమోదు పక్రియ ప్రారంభించేంది. గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ పక్రియను నిర్వహించేవారు. వంట సాగు చేసిన రైతుల పాలం వద్ద నిలబెట్టి పంటతో పాటు ఫొటో తీసి యాప్ వివరాలు నమోదు చేసేవారు. ఈ-క్రాప్ ఆధారంగానే ఎరువులు, ఇతర సాగుపాయాన్ని వ్యవసాయ సిబ్బంది. అందించేవారు. రైతులు పండించిన పంటను ఈ క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం కొనుగోలు చేసేది.ఈ పంట నమోదుతో పంటల బీమా వర్తింపచేసింది. వంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పంటల నష్టపరిహారానికి ఈ క్రాప్ ఉపయోగపడింది. అదే విధంగా పండించిన ధాన్యానికి మద్దతు ధరకు విక్రయించుకొనే అవకాశం లభించింది.

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగు పనులుబముమ్మరంగా జరుగుతున్నాయి. గోదావరి ఆయకట్టులో వరదల కారణంగా పంటలు చేతొకొచ్చే దశలో ఎలాంటి నష్టం జరగకుండా ఉండాలంటే వానాకాలం పంట సాగును నెల రోజుల ముందుకు తీసుకొచ్చి.. జూన్ మొదటి వారంలోని వరినాట్లు వేసుకోవాలని గత మూడేళ్ల అధికార యంత్రాంగం సూచిస్తున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలోనే జూన్1వ తేదీన కాల్వలకు నీరు విడుదల చేస్తున్నారు.. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో రైతులు ముందస్తు సాగుకు సన్నద్ధమయ్యారు. అధికార యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి ఈ క్రాప్ నమోదుపై స్పష్టత ఇవ్వటంతో పాటు పెట్టుబడి సాయం అందించేందుకు చొరవ చూపించి రైతులను అండగా నిలవాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

ఈ పంటను నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది(ఫైల్)

వినతిపత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సిటీ బస్సులు నడపాలి

స్టూడెంట్ స్పెషల్ బస్సులను ఏర్పాటు చేయాలి

రాజమండ్రి డిపో మేనేజర్‌కు ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లాలో విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని, రాజమహేంద్రవరం నగరంలో సిటీ బస్సులను నడపాలని రాజమండ్రి ఆర్‌టిసి డిపో మేనేజర్ షేక్.షబ్నంకు ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్ మాట్లాడారు. విద్యార్థులు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల మధ్యలో సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వ్యవధిలో పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణిస్తున్నారన్నారు. ఈ సమయంలో బస్సుల్లో ఖాళీ లేక చాలా సేపు వేచి ఉండాల్సి వస్తుందన్నారు. పల్లకడియం, ఈలకొలను, దొంతమూరు, బాలవరంలో ఉద్యార్థులకు బస్సు సౌకర్యం లేదన్నారు. ఈ గ్రామాల మీదుగా భలభద్రపురం నుంచి రాజమండ్రి వరకూ ఉదయం పూట, రాజమండ్రి నుంచి భలద్రపురం వరకూ సాయంత్రం సమయంలో బస్సులు నడపాలన్నారు. స్టూడెంట్ స్పెషల్స్ రాజమండ్రి నుంచి కాకినాడ రూట్ కి, అలాగే రాజమండ్రి నగరంలో పెద్ద ఎత్తున విద్యార్థులు ఉన్నారని వారి కోసం సిటీ బస్సులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు కనక అచ్చారావు పాల్గొన్నారు

అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన గద్దె సాయిసూర్య అవినాష్(25) వాటర్‌ఫాల్స్‌లో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతి విషయం తెలుసుకున్న అవినాష్ తల్లిదండ్రులు గద్దె శ్రీనివాసరావు, శిరీష దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అవినాష్ తాడేపల్లిగూడెంలోని శశి ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ పూర్తి చేశాడు. ఎంఎస్ చేస్తానంటే అమెరికు పంపారు. అమెరికాలోని చికాగో రాష్ట్రంలో డేట్రైట్ సిటీలోనే ట్రైన్ యూనివర్సిటీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. న్యూజెర్సీలో ఉంటూ చదువును కొనసాగిస్తున్నాడు. ఈ ఏడాది డిసెంబర్‌తో చదువు పూర్తికానుంది. ఆదివారం సాయంత్రం సుమారు 4 గంటల ప్రాంతంలో అక్కడ ఉన్న బంధువులతో కలిసి అవినాష్ వాటర్ ఫాల్స్‌కి వెళ్లాడు. ప్రమాదవశాత్తు వాటర్ ఫాల్స్‌లో పడిపోయి మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. వారిని ఆపడం ఎవరితరమూ కావడం లేదు. అమెరికాలో ఉన్న తానా అవినాష్ మృతిపై విచారం వ్యక్తం చేసింది. మృతదేహాన్ని ఇండియాకు పంపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తానా ప్రతినిధులు తెలిపారు.

స్టాఫ్ నర్సుపై దాడికి ఖండన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తిరుపతి రుయా ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుపై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సెస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.దయామణి తీవ్రంగా ఖండించారు. ఆమె మాట్లాడుతూ దశాబ్దాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తూ ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న రోగులకు ప్రాణాలను పణంగా పెట్టి వైద్యం అందిస్తున్నామన్నారు. అయినా తమ ఉద్యోగాలకు ఎలాంటి భద్రత ఇవ్వకుండా గత ప్రభుత్వాలు కాలయాపన చేశాయన్నారు. కనీసం విధినిర్వహణలో తమ ప్రాణాలకు భద్రత లేకుండాపోయిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విధులను ఎలా నిర్వర్తించాల్లో అర్థం కావట్లేదన్నారు. గతంలో ఒంగోలు రిమ్స్, నెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్స్ వంటి పెద్ద ఆసుపత్రుల్లోనూ నర్సులపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయన్నారు. వీటిని మరువకముందే మరో ఘటన రుయాలో జరగటం ఆందోళన కలిగిస్తుందన్నారు. ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా పూర్తిస్థాయిలో అమలు కావట్లేదన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి గాయపడిన స్టాఫ్ నర్సుకు జీతంతో కూడిన సెలవులు మంజూరు చేయాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దమ్ముంటే విచారణ జరిపించాలి : రాజా

ప్రజాశక్తి - సీతానగరం

నన్నయ యూనివర్శిటీలో అక్రమాలు జరిగి ఉన్నాయని ఆరోపిస్తున్న ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణకు దమ్ముంటే విచారణ జరిపించాలని మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా సవాల్ చేశారు. సోమవారం కోరుకొండ వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సిఎం వైఎస్.రాజశేఖరరెడ్డి, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు ఆలోచన మేరకు నన్నయ యూనివర్సిటీ ఏర్పడిందన్నారు. యూనివర్సిటీకి పలు సౌకర్యాలు కల్పించడానికి ప్రయత్నాలు జరిగాయన్నారు. 2014 నుంచి 2019 వరకు యూనివర్శిటీ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. గడిచిన ఐదేళ్లలో యూనివర్సిటీకి నిధులు మంజూరుకు ఆయా డిపార్ట్‌మెంట్ల చుట్టూ తిరిగామన్నారు. నిధుల మంజూరులో జాప్యం జరిగే పక్షంలో అంతర్గత నిధులను ఉప యోగించుకోడానికి అనుమతి కోరామన్నారు. యూనివర్సిటీలో పలు భవనాలు కూడా నిర్మాణం అయ్యాయన్నారు. ఎన్నికల సమయంలో దొంగ ఓట్లు ఉన్నాయంటూ చేసిన ఆరోపణ ఏమైందన్నారు. కనీసం రెండువేల దొంగ ఓట్లు ఉన్నట్టు కూడా అధికారులు గానీ, ఎన్నికల సంఘం గానీ ధ్రువీకరించినట్లు ఎక్కడా లేదన్నారు. ఇలాంటి అబద్ధపు ఆరోపణలతో బురద జల్లే ప్రయత్నం, దుష్ప్రచారం చేయడం తప్ప బత్తులకు మరొకటి లేదని విమర్శించారు. అవుట్‌సోర్సింగ్ పేర ఉద్యోగాలు అమ్ముకుని, వారికి పిఎఫ్‌లు, ఇఎస్ఐలు కట్టకుండా ఉద్యోగుల సొమ్ము మింగేసిన వ్యక్తులు తన గురించి మాట్లాడుతున్నారని విమర్శలు చేశారు. ఊరికే బురద జల్లి పబ్బం గడుపుకోవాలని చూస్తే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు.

రూ.3 కోట్లతో డ్రెయినేజీ పనులకు ప్రణాళిక

రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ బుచ్చయ్య చౌదరి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం గ్రామంలో రూ.3 కోట్లతో డ్రెయినేజీ పనులను నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేశామని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. కలెక్టర్ ప్రశాంతితో కలిసి ఆయన సోమవారం ధవళేశ్వరం గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో జనాభా పెరుగుతున్న దృష్ట్యా అందుకు అనుగుణంగా డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు శానిటేషన్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ సిబ్బంది సేవలు పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలన్నారు. సుమారు 140 మంది పైగా శానిటేషన్ సిబ్బంది ఉన్నా పారిశుధ్యం నిర్వహణలో అలసత్వం కనిపించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్ సిబ్బంది హాజరు వివరాలతో కూడిన నివేదిక అందించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఎక్కడా సిబ్బంది పనిచేసిన జాడలు కనిపించడం లేదని, ఇదేనా పర్యవేక్షణ అంటూ పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. మురుగునీటి కాలువలపై ఆక్రమణలను తొలగించాలని యజమానులకు సూచించాలన్నారు. పంచాయతీ ప్లానింగ్ మ్యాప్ ప్రకారం పరిశీలన చేయాలని పేర్కొన్నారు. ప్లాన్‌ను ఉల్లంఘించి నిర్మాణాలు చేసిన వాటిని గుర్తించి రెండు రోజులు సమయం ఇవ్వాలన్నారు. అప్పటికీ తొలగించకపోతే వెంటనే పంచాయతీ వారే తొలగించి ఆ రుసుము వారి నుంచి వసూలు చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో గ్రామ ప్రజలు అధికారులకు సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ పర్యటనలో రూరల్ ఎంపిడిఒ డి.శ్రీనివాస్, మండల స్పెషల్ ఆఫీసర్ కెఎన్.జ్యోతి, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల, కలెక్టర్ ప్రశాంతి

అధికారులు మైండ్‌సెట్ మార్చుకోవాలి

పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలన్నింటిపైన విచారణ చేయిస్తామని, అధికారులు మైండ్ సెట్ మార్చుకుని పనిచేయాలని మంత్రి కందుల దుర్గేష్ హితవు పలికారు. సోమవారం ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, చివటం సర్పంచ్ ఇడుపుగంటి సత్యనారాయణ, ఎంపిటిసి వేముల సత్యనారాయణ, వేలివెన్ను సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ, ఎంపిటిసి కాకర్ల కరుణాకర్ తదితరులు మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో టిడిపి, జనసేన మద్దతుగా ఉన్న సర్పంచులున్న పంచాయతీలకు అధికారులు ఒక్క పైసా కూడా నిధులు మంజూరు చేయలేదన్నారు. దీనిపై మంత్రి స్పందించారు. ఉద్యోగులకు రాజకీయ ప్రమేయం ఉండరాదన్నారు. పార్టీలకతీతంగా సేవలందించాలన్నారు. జల్ జీవన్ పనుల్లో నాణ్యత కొరవడకుండా చూసుకోవాలన్నారు. ఉపాధిలో గల్లంతైన డబ్బులను లబ్ధిదారులందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో అలసత్వం వహించే అధికారులపై తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

కార్టూన్'నిజం'



ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలను నిర్వహించారు.

రాజమహేంద్రవరంలోని వైసిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల లీగల్ సెల్ రీజినల్ కో-ఆర్డినేటర్ సాదిక్ హుస్సేన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాజీ సిఎం జగన్‌కు న్యాయవాదులు అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పి.శంభుప్రసాద్, భావన రంగారావు, మాలక శ్రీనివాస్, రూపా రాజేశ్వరి, చెరుకూరి రామారావుచౌదరి, ఫిలిప్ ప్రేమ్ కుమార్, మాగపు పద్మ, కాశీ శ్రీనివాస్, మొగత పల్లి రామకృష్ణ, ఎస్‌విఎస్.రెడ్డి, ఎస్.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** గ్రామంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, స్వీట్లు, పండ్లు పంచారు. మాజీ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, ఎంపిపి మట్టా వీరస్వామి మాట్లాడారు. వైసిపి మండల అధ్యక్షుడు చెల్లింపు దుర్గామల్లేశ్వరరావు వైస్ ఎంపిపి జె.రామచంద్రరావు జుట్టా ఏడుకొండలు, నాయకులు కార్యర్తలు పాల్గొన్నారు. చంద్రవరంలో సర్పంచ్ మద్దిపాటి శ్రీరామ్మూర్తి బ్రాహ్మణగూడెంలో ఆత్కూరి దొరయ్య ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. **గోకవరం** పాత బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన వైఎస్ఆర్ జయంతిలో వైసిపి జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌చార్జి తోట నరసింహం, యువనాయకుడు తోట రాంజీ హాజరయ్యారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి, నాయకుడు సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, సీనియర్ నాయకులు దాసరి చినబాబు, వరసాల ప్రసాద్, వైస్ ఎంపిపి మడికి మైనర్ బాబు, గోకాడ చిట్టిబాబు, నాయకులు గుల్లా ఏడుకొండలు, సర్పంచులు పాల్గొన్నారు. **కడియం** మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్ఆర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచారు. **ఉండ్రాజవరం** మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. **తాళ్లపూడిలో** నిర్వహించిన కార్యక్రమంలో వైసిపి కొవ్వూరు నియోజకవర్గ ఇన్చార్జి తలారి వెంకట్రావు పాల్గొన్నారు. తాళ్లపూడిలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, జడ్‌పి వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, వైసిపి మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావ తదితరులు పాల్గొన్నారు. మలకపల్లిలో కె.కేశవనారాయణ, పెద్దేవంలో రామకృష్ణ, వేగేశ్వరపురంలో సర్పంచ్ కె.పరశురామారావు, గజ్జరంలో సర్పంచ్ డాక్టర్ జి.రాంబాబు, అన్నదేవరపేటలో పోసిన శ్రీకృష్ణదేవరాయలు, పిట్ట శ్రీను ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.



తాళ్లపూడిలో...

నివాళులర్పిస్తున్న వైసిపి లీగల్ సెల్ నాయకులు

విద్యతోనే ప్రగతి : ఎంఎల్ఎ వాసు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యతోనే ప్రగతి సాధ్యమని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. లాలాచెరువు ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చదువుతో ఏదైనా సాధించొచ్చన్నారు. విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. అమ్మకు వందనం కార్యక్రమం ద్వారా ఇంట్లో చదువుతున్న పిల్లలందరికీ తల్లుల ఖాతాలో సొమ్ము జమచేస్తుందన్నారు. అనంతరం అమ్మ పేరుతో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో మామిడి మొక్క నాటారు. తొలుత అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు స్వాగతం పలికారు. మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్, 50 వార్డ్ ఇన్‌ఛార్జి మరియు, టౌన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి యాదవ్, అర్బన్ ఎంఇఒ-2 రమా రజని, హెచ్ఎం ఎ.మల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - గోపాలపురం

అర్హులైన ప్రతి కౌలు రైతుకీ గుర్తింపు కార్డు అందివ్వాలని తహశీల్దార్ డి.వనజాక్షి అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని రెవెన్యూ అధికారులు, వ్యవసాయ ఉద్యాన సహాయకులుకు మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు అధ్యక్షతన కౌలు కార్డులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. ఈ ఏడాది మండలంలో 6,210 కార్డులను ఇవ్వాలని నిర్దేశించినట్లు తెలిపారు. కార్డుల మంజూరులో ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గరాదన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన తర్వాత మాత్రమే కార్డులివ్వాలని స్పష్టం చేశారు. ఈనెల 30లోగా కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీలు ప్రదీప్, కృష్ణ, విఎఎలు విహెచ్ఇల్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి : రామారావు

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఎన్‌డిఎలో భాగస్వామ్యంగా ఉన్నప్పటికీ కొవ్వూరు నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, దీని కోసం కృషి చేస్తున్నామని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ టివి.రామారావు అన్నారు. మండలంలోని వేగేశ్వరపురంలో సోమవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేశారని దానికి తగ్గట్టుగా ఫలితాలు వచ్చాయన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు తైలం పోసారావు, నాగేశ్వరరావు, బుద్ధాల సూరిబాబు, వెంకటలక్ష్మి, కె.భవాని, బాలకృష్ణ పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లను రెగ్యులరైజ్ చేయాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్‌లో కొందరిని జిఒ 114 ప్రకారం రెగ్యులర్ చేశారని, మిగలిన 966 మందినీ రెగ్యులర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కుందుల దుర్గేష్‌కు సోమవారం వినతి పత్రం అందించామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఐఎన్‌టియుసి జాయింట్ సెక్రటరీ కాపా నాగరాజు తెలిపారు. సోమవారం ఉండ్రాజవరంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి విచ్చేసిన మంత్రి దుర్గేష్ కు ఈ విషయమై వినతి పత్రం ఇచ్చామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.. ఈ కార్యక్రమంలో కె.సీతయ్య, ఆర్.శ్రీనివాసరావు, ఎం.సుధాకర్, వి.చిరంజీవి, యు.రాము, బి.శ్రీనివాస్, డి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యతోనే అసమానతలు దూరం

ప్రజాశక్తి- కడియం

పేద ధనిక, కులమత బేధాలను అసమానతలను దూరం చేసేది విద్య మాత్రమేనని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం 850 మంది విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సత్యవతి, ఎంఇఒ మణికుమార్, ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, కె.రాజు, డేవిడ్, వీరబాబు, అక్షయ, నాగమణి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రైన్ నుంచి జారిపడ్డ రైల్వే గార్డ్

ప్రజాశక్తి - సామర్లకోట
బెంగళూరు నుంచి హౌరా వెళ్తున్న 12864 హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి సోమవారం ఉదయం సామర్లకోట సౌత్ క్యాబిన్ వద్ద రైల్వే గార్డు ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో విజయవాడ రైల్వేలో రైల్వే గార్డ్‌గా పని చేస్తున్న యనమండ్ర దుర్గాప్రసాద్ రైలులో వెళ్తూ స్థానిక షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో గల క్యాబిన్ నుంచి జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచార ంతో రైల్వే సిబ్బంది ఆయనను ఎడిబి రోడ్డులోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్లేడుతో తోటి విద్యార్థిపై దాడి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్
హైస్కూల్‌లో కలిసి చదువుకుంటున్న విద్యార్థుల మధ్య వచ్చిన చిన్నపాటి తగాదా బ్లేడుతో దాడి చేసేవరకూ వెళ్లింది. ఈ ఘటన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాకినాడ రూరల్‌లోని ఎపిఎస్‌పి హైస్కూలులో పదో తరగి విద్యార్థికి, తొమ్మిదో తరగతి విద్యార్థికి మధ్య శనివారం తగాదా నెలకొంది. పదవ తరగతి చదువుతున్న విద్యార్థిపై తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థి రాయితో తలపై కొట్టాడు. అనంతరం బ్లేడుతో మెడపై దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి మెడకు 24 కుట్లు వేశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు. దీంతో బాధిత విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో గాయపరచిన విద్యార్థికి టిసి ఇచ్చి పంపించేశారు. ఈ సందర్భంగా తల్లితండ్రులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పర్యవేక్షణ లోపం వల్ల ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటు న్నాయన్నారు. దాడి చేసిన విద్యార్థులపై కనీసం క్రమశిక్షణ చర్యలు కూడా చర్యలు తీసుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల
నల్లజర్ల మండలం దూబచర్ల శివారు పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. దూబచర్ల శివారు కొత్తగూడెం గ్రామానికి చెందిన కనికెళ్ల విల్సన్ తాడేపల్లి గూడెంలోని ఓ ప్రయివేటు బ్యాంకులు ఉద్యోగం చేస్తున్నాడు. ఎప్పటిలానే సోమవారం బైకుపై డ్యూటీకి వెళ్లాడు. అనంతరం సాయంత్రం ఇంటికి బయలుదేరాడు. దూబ చర్ల శివారు పెట్రోల్‌బంకు వద్దకు వచ్చేసరికి రోడ్డుపక్క నిలిపి ఉంచిన పుల్లల లోడు ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో విల్సన్(28) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గడువు ముగిసిన పురుగు మందులు సీజ్

ప్రజాశక్తి - రాజానగరం
రాజానగరం శ్రీ వెంకటేశ్వర జనరల్ స్టోర్స్‌లో గడువు ముగిసిన పురుగు మందులను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. షాపు వెనుక గొడౌన్‌లోని ప్రత్యేక గదిలో వీటిని నిల్వ చేశారని అధికారులు తెలిపారు. వీటి విలువ రూ.2లక్షలు ఉంటుందని వ్యవసాయాధికారి షేక్ ఇమామ్‌ఖాసీమ్ తెలిపారు. వీటిని గొయ్యి తీసి కప్పెడతామని తెలిపారు. గడువు ముగిసిన తర్వాత పురుగు మందులు ప్రత్యేక గదిలో ఉంచాలన్నారు. వీటిని ప్రతి రోజు వారి స్టాక్‌లో ఉంచి అమ్మకాలు జరిపితే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం
ప్రమాదవశాత్తూ కారు కాల్వలోకి దూసు కువెళ్లి బోల్తా పడిన ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండ లంలోని అనాతవరం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి అరుణ్ రాజ్ జెరాక్స్ షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తు న్నాడు. ఈ నెల 4న షాపు మూసివేసి ఇంటికి వెళు తుండగా కారు అదుపు తప్పి అనాతవరం మాగం పంట కాల్వలోకి దూసుకు వెళ్లి బోల్తా పడింది. స్థానికులు తీవ్రంగా గాయపడిన అరుణ్‌ను అమలాపురం ప్రయి వేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొం దుతూ అరుణ్ రాజు ఆదివారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి జిబి.స్వామి తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం
భర్త వేధింపులకు గురి చేస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బి.సురేష్ బాబు తెలిపారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని దొమ్మేటివారిపాలెంకు చెందిన గౌతమికి అయినవిల్లి మండలం తొత్తరమూడి చెందిన మోరంపూడి శ్రీనివాసరావుతో 2021లో వివాహం అయ్యింది. కొంతకాలం కాపురం సజావుగానే సాగింది. తన భర్త ఒక యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని, మామగారు, ఆడపడుచుతో కలసి తనపై దాడులకు దిగి చంపుతానని బెదిరించడంతో చుట్టుపక్కల వారు తనను పుట్టింటికి పంపివేశారని తెలిపారు.

ఒక్కరోజే రూ.80 వేల వసూలు

ప్రజాశక్తి - కరప
కరప మేజర్ పంచాయతీలో ఒక్కరోజే ఆస్తి, కుళాయి పన్నుల ద్వారా రూ.80 వేలు వసూలు చేసినట్లు ఇన్‌ఛార్జ్ కార్యదర్శి కేశవరావు తెలిపారు. సోమ వారం పేపకాయలపాలెంలో నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్‌లతో కలిసి ఆయన పన్ను వసూళ్లు చేపట్టారు. నాయకుల సహకారంతో ఒక్కరోజే రూ.80 వేలు వసూలు అయిందన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - రౌతులపూడి
సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ములగపూడి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌందర్య అన్నారు సోమవారం మండలంలోని బలరామపురం ప్రజలకు సీజనల్ వ్యాధులపైఅ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అతిసార వ్యాధిపై పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నివాసం చుట్టూ పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని, కాచిన నీటిని మాత్రమే తాగాలని. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం కళ్యాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఫార్మా కంపెనీ ఎండికి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకుడు

కార్మికుల సమస్యలపై షెల్డాం ఎమ్‌డితో చర్చలు

ప్రజాశక్తి - యానాం
స్థానిక అడవి పొలంలో ఉన్న షెల్డామ్ ఫార్మా కంపెనీ ఎండి మూర్తితో కార్మికుల సమస్యలపై సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ చర్చించారు. కార్మికులకు సంబంధించి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందచేశారు. ఈ సందర్భంగా.షెల్డాం కంపెనీ ఎండి మూర్తి మాట్లాడుతూ కార్మికులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నామని అన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తమకు ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించడం లేదని, ప్రభుత్వ నుంచి సహకారం అందించినట్లయితే మరింత ఉపాధి కల్పించడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె మధుబాబు, కె సత్యనారాయణ, దాసరి రాజు, తిరుకోటి శ్రీను, సబ్బతి రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి - యానాం
వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యానాం నల్లచెరువు సమీపంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఎస్‌పి రాజశేఖరన్, సిఐ షణ్ముగం పాల్గొన్నారు. మల్లాడి ఆధ్వర్యంలో స్థానిక బొటానికల్ గార్డెన్ వద్ద ఘనంగా నిర్వహించారు. అనంతరం రైతులను సన్మానించి, వృద్ధులకు చీరలు, విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు.

ఉచిత ఇసుక ఘనత టిడిపిదే

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజల అవసరాలకు ఉచితంగా ఇసుక అందించిన ఘనత టిడిపి ప్రభుత్వా నిదేనని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి బాబి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. వైసిపి పాలనలో కొండలను తలపించేలా ఇసుక గుట్టలు ఉన్న ఇసుక లభించేది కాదన్నారు. సామాన్య ప్రజలకు ఇసుక అందకుండా వైసిపి నాయకులు దోచుకున్నారని విమర్శించారు. ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులకు జీవనోపాధి కరువైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టిడిపి అధినేత చంద్రబాబు ఇసుకను ఉచితంగా సామాన్యులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.

పరిశోధనలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం
స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలోని వివిధ విభాగాల్లో పరిశోధనలకు ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. కళాశాలలో పరిశోధనల కోసం ప్రత్యేకంగా అంతర్గత నోటిఫికేషన్ విడుదల చేసి అందులో వచ్చిన అధ్యాపకులతో పరిశోధన స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసి ఇంటర్వ్యూల ద్వారా 13 మంది అధ్యాపకులను వివిధ విభాగాల నుంచి ఎంపిక చేశామన్నారు. వీరికి ఒక సంవత్సరంన్నర గడువులో ప్రాజెక్టును పూర్తి చేసేల వ్యవధిని ఇచ్చి తగినంత ఆర్థిక సహాయాన్ని కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. గరిష్టంగా రసాయన శాస్త్రంలో నాలుగు, భౌతిశాస్త్రంలో మూడు, వాణిజ్య శాస్త్రంలో రెండు, వృక్ష శాస్త్రంలో ఒకటి, అర్థశాస్త్రంలో ఒకటి, మ్యాథమెటిక్స్‌లో ఒకటి, ఆంగ్లంలో ఒక పరిశోధనలను మంజూరు చేసినట్లు తెలిపారు. గతేడాది ఆరు ప్రాజెక్టులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఐసిఎస్ఎస్ఆర్ ద్వారా ఒక జాతీయ ప్రాజెక్టును తెలుగు శాఖ సాధించిందన్నారు. రుసా ఐదు ప్రాజెక్టులను కళాశాలకు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు ఉత్తమ పరిశోధనలు చేసి కళాశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల పరిశోధనా విభాగ సమన్వయకర్త డాక్టర్ ఈసుబ్ భాషా షేక్, ఐక్యూ ఎసి సమన్వయకర్త డాక్టర్ అన్నపూర్ణ, ప్రాజెక్టు గ్రహీతలు పాల్గొన్నారు. వారందరికీ చెక్కులను అందించారు.

చిత్రాడలో రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు

ప్రజాశక్తి - పిఠాపురం
మండలంలోని చిత్రాడ గ్రామంలోని అంబేద్కర్ సెంటర్‌లో స్కూల్, కాలేజ్ విద్యార్థుల కోసం రిక్వెస్ట్ స్టాప్‌ను ఆర్‌టిసి అధికారులు ఏర్పాటు చేశారు. విద్యార్థుల విజ్ఞప్తిపై స్పందించిన కాకినాడ ఆర్‌టిసి డిఎం మనోహర్, సిఐ బాలకృష్ణ, ఎస్ఎం.శ్రీనివాస్ సోమవారం రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్

ప్రజాశక్తి - జగ్గంపేట
జగ్గంపేట మెయిన్ సెంటర్‌లో నిర్వ హిస్తున్న అన్న క్యాంటీన్‌ను సోమవారం కొనసాగింది. గండేపల్లి మండలం నీలాద్రి పేట గ్రామానికి చెందిన కురుకూరి వీర వెంకట సత్యనారాయణ, ఆయన కుమారుడు గణేష్‌బాబు ఆర్థిక సాయంతో అవసరార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు ఎస్‌విఎస్.అప్పలరాజు మాట్లాడుతూ గత ఏడాదిన్నర కాలంగా దాతల సహకారంతో అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, జోగారావు, మారిశెట్టి రాధా, సీతారామయ్య పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - సామర్లకోట
సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన యర్రపోతిన వెంకటరామచౌదరి, ఆశ రాణి దంపతులు రూ.లక్ష విరాళం అందజేసినట్లు ఆలయ ఇఒ బల్ల నీలకంఠం చెప్పారు. సోమవారం భీమేశ్వర స్వామి, బాలా త్రిపురసుందరిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి ఆలయ సిబ్బందికి చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు ప్రసాదాలు అందజేశారు.

ఆక్రమణలు తొలగించిన అధికారులు

ప్రజాశక్తి - పిఠాపురం
పట్టణంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుపై మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలో కాకినాడ రోడ్డులో పంట కాలువను అనుకుని కొందరు వ్యక్తులు ఆక్రమణలు చేసి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆ ప్రాంత రైతులు పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఆక్రమిత ప్రాంతంలో రోడ్డు మార్జిన్‌లను గుర్తించి ఆక్రమించి నిర్మాణం చేసిన షాపులను అధికారులు తొలగించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ టిపిఒ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బిఎస్‌సి నర్సింగ్ పరీక్షలు నిర్వహించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బిఎస్‌సి నర్సింగ్ పరీక్షల ను కాకినాడలోనే నిర్వహిం చాలని జాయింట్ కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ బృందం వినతిపత్రం అందించింది. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మణికంఠ, కాకినాడ నగర కార్యదర్శి ఎ.వాసుదేవ్, కాకినాడ రూరల్ అధ్యక్షులు రాజేష్ వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో బిఎస్‌సి నర్సింగ్ చదువుతున్న విద్యార్థులు ప్రతి ఏడాది రంగరాయ మెడికల్ కళాశాలలో సెమిస్టర్ పరీక్షలు రాసేవారని అన్నారు, అయితే ఈ ఏడాది అమలాపురం కిమ్స్ హాస్పిటల్‌లో పరీక్షా కేంద్రం ఇవ్వడం వల్ల విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు. కాకినాడ జిల్లా నుంచి అమలాపురం వెళ్లి పరీక్ష రాయాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలకు గురికావాల్సివస్తుందని అన్నారు.

రైతాంగానికి తప్పని తిప్పలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

జెసిబితో తుక్కును తొలగిస్తున్న రైతులు

బ్యాంక్ కెనాల్ పంట కాలువ పైభాగాన ఉన్న ఇంజరం వంతెన నిర్మించ కపోవడంతో రైతాంగానికి తిప్పలు తప్పడం లేదు. శిథిలావస్థకు చేరుకున్న ఇంజరం వంతెన స్థానంలో రాకపోకలు సాగించేందుకు పదేళ్ల క్రితం ఆ వంతెనకు దిగువన పంట కాలువపై తాత్కాలిక కల్వర్టు నిర్మించింది. నాటి నుంచి సుమారు 11,500 ఎకరాలకు సాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో అందక రైతులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా సాగునీటి ఎద్దడి రబీలో ఉండటం సాధారణం. అయితే తాళ్లరేవు మండల రైతాంగం ఖరీఫ్ సీజన్లోనూ సాగునీటి కష్టాలు ఎదుర్కొంటుంది. ఇంజరం కల్వ ర్టుకు అడ్డుగా ముళ్లకంపలు, చెత్తాచెదారం నిలిచి పోవడంతో దిగువకు నీటి విడుదల కావడం లేదు. కల్వర్టు వద్ద ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన సంబంధిత శాఖ యంత్రాంగం వారాని కోసారి తొలగిస్తున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతు న్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి కల్వర్టు వద్ద చెత్తను ప్రతీ రోజు తొలగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సుబ్బరాజు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కడియం
ఇటీవల అనారోగ్యంతో మరణించిన మండపేట ప్రజాశక్తి విలేకరి పి.సుబ్బరాజు కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో రూ.10వేల చెక్కుతో పాటూ ఎంఎల్ఎ వేగుళ్ల రూ.10వేలు అందించారు. మండపేటలోని ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ మాట్లాడారు. సుబ్బరాజు యూనియన్‌లో క్రియాశీలక సభ్యులుగా పని చేశారన్నారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనారోగ్యానికి గురైన జర్నలిస్టులకు రూ.5 వేలు, దురదృష్టవశాత్తు మరణిస్తే రూ.10 వేలు అందిస్తున్నామన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఫెడరేషన్ నిరంతరం పని చేయడం అభినందనీయమని, ఫెడరేషన్ కార్యక్రమాలకు తన వంతు సాయం అందిస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు పురె త్రినాథ్, గునిపే శోభన్‌బాబు, కె.సత్య, రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు రెడ్డి ఒమేష్, మండపేట నియోజకవర్గ అధ్యక్షులు వేమగిరి నూకరాజు, మండపేట ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు బొల్లోజు మల్లేశ్వర్, కార్యదర్శి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

సేవలను విస్తరింపజేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట
శాశ్వత ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా లయన్స్ క్లబ్ సేవలు మరింత మెరుగుపరచాలని లయన్స్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, మాజీ గవర్నర్ బాధం బాలకృష్ణ పిలుపునిచ్చారు. శ్రీ భీమేశ్వర లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్షులు ఎస్ఆర్‌వై విఆర్.ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామర్లకోట క్లబ్ సేవల అమలులో జిల్లావ్యాప్తంగా ముందు భాగాన ఉంద న్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన అధ్య క్షులు ప్రసాద్, కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, కోశాధికారి బడుగు సీతారామరాజులతో బాధం బాలకృష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షులు ప్రసాద్‌కు అధికార దండాన్ని అందజేశారు. అనంతరం వివిధ క్లబ్‌లకు చెందిన ప్రతినిధులు నూతన కమిటీని అభినందించారు. ఎన్‌ఐటి విద్యాభ్యాసానికి ఎంపికైన పేద విద్యార్థికి ఆర్థిక సయాహాన్ని అందజేశారు. జిల్లా క్లబ్ మొదటి వైస్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు, రెండవ వైస్ గవర్నర్ చిట్టిండి శ్రీనివాస్, వివిధ క్లబ్‌ల ప్రతినిధులు మట్టే రాధ, దుర్గేష్, శ్రీరామ్ రాజు, నమస్సివాయ, శ్రీనివాస్, జిల్లా ఛైర్మన్ చిత్తూలూరి వీర్రాజు పాల్గొన్నారు.

సహకార సంఘాల్లో డిజిటల్ సేవలు

ప్రజాశక్తి-అమలాపురం
సహకార సంఘాల్లో ఆన్‌లైన్ డిజిటల్ సేవలు బలోపేతం చేసే దిశగా 300 రకాల సేవలతో కామన్ సర్వీసెస్ సెంటర్ పోర్టల్ తీసుకు వచ్చినట్టు కేంద్ర సహకార మంత్రిత్వపు శాఖ రాష్ట్ర సమన్వయాధికారి డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్‌ను కలిశారు. కామన్ సర్వీస్ పోర్టల్ విధివిధానాలపై రెండు రోజులపాటు సహకార సిబ్బందికి ఇస్తున్న శిక్షణను గురించి వివరించారు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ డిజిటల్ ఇండియాలో భాగంగా ఈ గవర్నెన్స్ డిజిటల్ సేవలు అందించడానికి వీలుగా తద్వారా సహకార సంఘాలలో వనరులు సమీకరణ సులభతరంగా ఉండేందుకు ఈ శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల సమాఖ్య అధ్యక్షులుగా త్రివేణి

ప్రజాశక్తి -మామిడికుదురు
పి.గన్నవరం మండలం సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలుగా యర్రంశెట్టి వారిపాలెం సర్పంచ్ యర్రంశెట్టి త్రివేణి వీరాస్వామిని మండల సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పోతవరం సర్పంచ్ వడలి కొండయ్య, కె.ముంజవరం సర్పంచ్ కుంపట్ల నాగలక్ష్మి నాయుడు, కార్యదర్శిగా నాగులంక సర్పంచ్ యల్లమిల్లి కృష్ణవేణి చిట్టిబాబు ఎన్నికయ్యారు. పి.గన్నవరంలో సోమవారం జరిగిన సమాఖ్య కార్యవర్గాలను ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందనిసర్పంచులకు భరోసా కల్పించారు.

కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

వైస్ ఎంపిపి శ్రీనివాస్‌కు పరామర్శ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

నివాళులర్పిస్తున్న రమణారావు నాయకులు

పితృ వియోగంతో బాధ పడుతున్న మునిపల్లి వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావును సోమవారం వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకుడు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు, నాయకులు పరామర్శించారు. శ్రీనివాసరావు తండ్రి నారాయణమూర్తి ఇటీవల మృతి చెందారు. నారాయణమూర్తి చిత్రపటానికి రమణారావు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో ఎంపిటిసిలు కొంకి ఏడుకొండలు, వంగా గిరిజాకుమారి, వైసిపి మండల కార్యదర్శి పినిపే జయరాజు, నాయకులు ఓగూరి విజయకుమార్, నేరేడుమిల్లి శ్రీను, గంటా లక్ష్మీప్రసాద్, కుంచే అర్జున్ ఉన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమలాపురం
మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలో అమలాపురానికి చెందిన పలువురు టిడిపి నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను మెట్ల రమణబాబు, కర్రి దత్తుడు, అధికారి బాబ్జి, మట్టా ప్రభాకర్, పొలమూరి ధర్మపాల్ మర్యాద పూర్వకంగా కలిశారు.

In the Court of the 5th Additional Junior Civil Judge at Kakinada
O.S. No. 882/2023
Between:
Dadala China Satyanarayana ...*Plaintiff*
AND
Dalala Satyanarayana and Another ...*Defendants*
To:
Defendant-1: Dadala Satyanarayana, S/o. Ramaswamy, Hindu, R/o. Door No. 2-11, Sunkatarevu, P.Mallavaram Post, Tallarevu Mandal, Kakinada District.
పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనకుండగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 19-7-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
కె.వి.ఎస్.వి.లక్ష్మాజిరావు
అడ్వకేటు, కాకినాడ
సెల్: 9866211196

ఘనంగా మరిడమ్మ మొదటి సంబరం

ప్రజాశక్తి - పెద్దాపురం

వివిధ వేషధారణలతో కళాకారులు

37 రోజుల పాటు జరిగే పెద్దాపురం మరిడమ్మ జాతరలో భాగంగా పట్టణంలో వివిధ ప్రాంతాల వాసులు నిర్వహించే సంబరాల్లో భాగంగా స్థానిక శెట్టిగపేట వాసులు మొదటి మరిడమ్మ సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. సంబరంలో విద్యుత్తు దీపాలంకరణ మధ్య ఏర్పాటుచేసిన బండ్ల వేసాలు, జానపద కళారూపాలు యాత్రికులను, ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నేడు కిర్లంపూడి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కిర్లంపూడి
మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బడే రాజేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొంటారని, కావున సకాలంలో ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వం మారినా తీరు మారలేదు

ప్రజాశక్తి - కాకినాడ
ప్రభుత్వం మారినా నగర పాలక సంస్థ అధికారుల తీరు మారలేదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు సోమవారం ఓ ప్రకటనలో విమర్శంచారు. నగర పాలక సంస్థలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, హెల్త్, పరిపాలన విభాగాల్లో ఏళ్ల తరబడి విధులు నిర్వర్తిస్తూ గత ప్రభుత్వ పాలనలో కార్పొరేషన్ ఆస్తులను నాశనం చేశారని అన్నారు. స్మార్ట్ సిటీ పేరుతో చేస్తున్న పనులపై ఎసిబి విజిలెన్స్ దర్యాప్తులు జరగలేదన్నారు. నగరాన్ని అనేక సమస్యలు పట్టిపీడుస్తున్నాయని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. నగర అభివృద్ధిపై అఖిలపక్షం సూచనలు, సలహాలు స్వీకరించాలని కోరారు.

రాగి పంట సాగుపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - కోటనందూరు
రాగి పంట సాగుపై రైతులు మక్కువ చూపాలని వ్యవసాయ శాఖ ఎఒ కె.చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ పది ఎకరాల్లో రాగి పంటను పండించాలని సూచించారు. రాగి విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఖరీఫ్‌లో వరిని సాగు చేస్తున్న రైతులకు1064 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 30 కేజీల విత్తనాల బస్తా రూ.1050 లభిస్తుందన్నారు. రైతులు అధికంగా సోనామసూరిపై ఆసక్తి చూపుతున్నారని, మండల పరిధిలో ఈ ఏడాది 10425 ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు అంచనా వేశామన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, SRIKAKULAM.
I.A.93/2022 I.P.15/19
BETWEEN:
KOTNI JAYA SANKAR ...PETITIONER
AND
POTNURU GANESH & OTHERS ... RESPONDENTS
To
R7
KOTTURU SATYANARAYANA
S/o KASULU
TUNI Town & Mandal
EAST GODAVARI District.
NOTICE
పై నెంబరు పిటీషన్‌లో పిటీషనర్ default order తే 24-06-2022 ది setside చేయమని పిటీషన్ దాఖలు చేయగా మీకు నోటీసు నిమిత్తం తే 25-07-2024 దికి వాయిదా అయివున్నది. కావున పై తే 25-07-2024 దిన మీరు ఉ॥ 10.30 ని॥లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, లేదా అడ్వకేటు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడం అగునని ఈ నోటీసు మూలంగా తెలియజేయడమైనది.
శ్రీకాకుళం
తేది : 07-07-2024
బి.వి.పి. సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, శ్రీకాకుళం.
సెల్ : 9290601445

దావా సమను ప్రకటన
మహారాజశ్రీ పెద్దాపురం 7వ జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్టు వారి సముఖమునకు
O.S. No. 19/2024
వాదులు: తాడికొండ గాయత్రీ వగైరాలు
ప్రతివాదులు: M/s. రిషిక్ బిల్డర్స్, రిప్రజెంటెడ్ బై మేనేజింగ్ పార్టనర్, శ్రీమతి పసుపులేటి షాలిని, వగైరాలు
ప్రతివాదులు:
1. M/s. Rishik Builders, Rep. by its Managing Partner, Smt. Pasupuleti Shalini W/o. Susheel Kumar, aged 44 years, 1st Floor, Pensioners Association Building, Main Road, TS No. 1080, Peddapuram
2. Pasupuleti Shalini, W/o. Susheel Kumar, Resident of D.No. 19-1-322/1, Bank Colony, G-4, Kings Opera, Sainagar, Peddapuram.
3. Pasupuleti Susheel Kumar, S/o. Yogi Raju, Resident of D.No. 19-1-322/1, Bank Colony, G-4, Kings Opera, Sainagar, Peddapuram.
పై నెంబరు దావా పరిహార నిమిత్తం మీ పయిన వాది అను వారు పై కోర్టులో దావా దాఖలు చేసినందున అందుకు ఆక్షేపణలు తెలియచేయుటకు మీరు పై కోర్టు వారి ఎదుట **ది. 24-07-2024వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియచేయడమైనది.
చావలి కృష్ణారావు, అడ్వకేట్
వాది తరపున అడ్వకేట్
డో.నెం. 9-1-32 ప్లీడర్ల వీధి, పెద్దాపురం

In the Court of the Principal Junior Civil Judge Court, Ramachandrapuram
I.A. No. 863/2022 in **O.S. No. 52/2022**
Between:
Kodavati Lakshmi and another ...*Petitioner/ Defendant*
AND
Pothamsetti Anjaneya Reddy ...*Plaintif/ Respondent*
Plaintiff/ Respondent:
Pothamsetti Anjaneya Reddy, S/o. Arjuna Reddy, age 36 yrs, Dr.No. 2-200, Draksharama, Ramachandrapuram Mandal, Dr. B.R.A.Konaseema Dt.,
పై నెంబరు గ్రంథంలో పై పిటీషనరు/ ప్రతివాది పరిహారం నిమిత్తం పై కోర్టులో మీపై పిటీషన్ O/Or 9, Rule 13 ను దాఖలు చేయగా సదరు కోర్టువారు అనేక పర్యాయములు నోటీసులు కోర్టు నుండి పంపగా మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. అందుపై శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసులు అమలు జరుపుటకు ది.వి. 15-07-2024వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు గాని, మీ తరుపున ప్లీడరు గాని శ్రీ కోర్టు వారి ఎదుట **ది.వి. 15-07-2024వ తేదీన సమయం 10.30 ని॥'లకు** హాజరు అయి మీ తరుపున ఆక్షేపణలు ఏమైన ఉంటే దాఖలు చేయగలరు. లేనియెడల మీ తరుపున శ్రీ కోర్టు వారు పరోక్షముగా ఉత్తర్వులు చేయగలరు.
రామచంద్రపురం
ది.08-7-2024
చింతపల్లి శ్రీనివాసరావు
న్యాయవాది